క్లుప్తంగా

చిత్రలేఖనంలో విద్యార్థినికి బంగారు పతకం



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న జాహ్నవి

వెంకటగిరి రూరల్: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని జాహ్నవి చిత్రలేఖనంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థిని జాహ్నవి గీసిన మండాల ఆర్ట్ బంగారు పతకానికి ఎంపికైంది. ఈ మేరకు శనివారం విద్యార్థికి ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు, ఒంగోలు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకుంది. ఈ మేరకు జాహ్నవిని పలువురు అభినందించారు.

పోటాపోటీగా భూముల వేలం



విన్నమాలలో ఆలయం వద్ద వేలం పాట

నాయుడుపేట టౌన్: శ్రీకాళహస్తీశ్వర స్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలకు చెందిన భూములకు విన్నమాల గ్రామంలో శనివారం దేవదాయ శాఖ అధికారులు వేలం పాటలు నిర్వహించారు. ఆలయాలకు సంబంధించిన 19 ఎకరాల వరకు ఉన్న భూములను ఏడాది లీజుకు వేలం పాటలు పోటాపోటీగా జరిగాయి. దేవదాయ శాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఈఓ రవికృష్ణ ఆ శాఖ సిబ్బందితో కలసి ఆలయం వద్ద వేలం పాటలను జరిపారు. గత ఏడాది పాడిన దానికి కంటే హెచ్చు మొత్తంలో 16 మంది వేలం పాటలో లీజుకు దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. దేవదాయ శాఖ కోట ఆలయాల ఈఓ శశాంక్, సిబ్బంది హరిరెడ్డి, యుగంధర్, బాలాజీ, విన్నమాల వీఆర్ఓ శివకుమార్, గ్రామ పెద్దలు అరవ భూమి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

కండలేరులో 46.029 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 46.029 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 1350, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 125, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ

గూడూరు రూరల్: స్వయం సహాయక ప్రొఫైల్ యాప్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, యాప్‌లో డేటాను అప్‌లోడ్ చేసే సమయంలో గ్రూప్ సభ్యులు ఉండాలని మెప్మా పీడీ రాధమ్మ తెలిపారు. గూడూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మాలోని గ్రూప్ సభ్యులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక గ్రూపులకు సంబంధించిన ప్రొఫైల్‌పై మెప్మా సీఓ, డీఈఓ, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీలు అవగాహన పెంచుకునేందుకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. డేటా అప్‌లోడ్ చేసే సమయంలో సంబంధిత సభ్యులు తప్పక ఉండాలని అన్నారు. అలాగే కొత్త సభ్యులు వివరాలను అప్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం పెంచలయ్య, గోపి క్రిష్ణవేణి, ప్రమీల, వసంత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ఓజిలి: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కురుగొండ, చిలమానుచేను, ఓజిలి గ్రామాల్లో పింఛన్ల పంపిణీని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 5505 పింఛన్లకు గాను 5457 పింఛన్లను పంపిణీ చేయడంతో 99 శాతం నమోదైందన్నారు. మిగిలిన 48 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని చెప్పారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈఓ శైలజ

కోట: గూడలి జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.రాధయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శనివారం ఎమ్మార్సీ భవనంలో నిర్వహించారు. ఎంఈఓ శైలజ, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించి విద్యారంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఆరోగ్యప్రదాయిని సీతాఫలం





మార్కెట్టులో లభ్యమౌతున్న సీతాఫలం పండ్లు, చెట్టుకు విరగ్గాసిన సీతాఫలం

- పుష్కలంగా ఔషధ గుణాలు

చిల్లకూరు: కాలానుగుణంగా లభ్యమయ్యే పండ్లను కచ్చితంగా రుచి చూడాలని పెద్దలు, వైద్యులు చెబుతుంటారు. మధుమేహం వ్యాధి ఉన్న వారు ఇందుకు కొంత భిన్నంగా వ్యవహరిస్తూ తీపి పండ్లకు దూరం అవుతుంటారు. అయితే వివిధ కాలాల్లో దొరికే పండ్లను తినడం ద్వారా వారికి కూడా పెద్ద నష్టం ఉండదనేది వైద్యుల సూచన. అయితే సీతా కాలంలో దొరికే సీతాఫలం ఆరగిస్తే జలుబు, జ్వరం వస్తాయనేది కూడా ఒక భయం. ఈ పండు తిన్న తరువాత అర గంట వరకు నీటిని తాగకుండా ఉంటే ఎలాంటి జలుబు, జ్వరం రాదని వైద్యులు అంటున్నారు. అలాంటి సీతాఫలం నేడు మార్కెట్‌లో విరివిగా లభిస్తోంది.

ధర తక్కువ... పోషకాలు ఎక్కువ

ఆపిల్ ధర అధికంగా ఉంటుంది. అయితే సీతాఫలం తక్కువ ధరకే లభ్యమవుతోంది. ఇంటి వద్ద చెట్లు పెంచుకుంటే సీజన్‌లో పండ్లు విరివిగా దొరికే అవకాశం ఉంది. ఈ పండును చిన్నాపెద్ద అంతా ఇష్టంగా తింటారు. ఈ పండు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రక్త పోటును అదుపులో ఉంచుతుంది. కొవ్వు శాతం తగ్గిస్తుంది. కంటి చూపును మెరుగుపరుస్తుంది. ఆరోగ్యానికి అవసరమైన పీచు పదార్థాలు, విటమిన్లు, శరీరాన్ని చురుకుగా ఉంచేందుకు కావాల్సిన మెగ్నీషియం సీతాఫలంలో ఎక్కువగా ఉంటాయి. పొటాషియం, మెగ్నీషియం గుండెకు రక్షణ కవచంలా పని చేస్తాయి. అధిక బరువుతో ఉన్న వారికి ఇది ఎంతగానో ప్రయోజనకరం. అనవసరపు కొవ్వును కరిగించే గుణం దీనికి ఉంది. అలాగే జ్ఞాపక శక్తిని పెంపొందించేందుకు దోహద పడుతుంది.



మార్కెట్టులో సీతాఫలాలు శీతాకాలంలోనే లభ్యం

సీతాఫలం ఎప్పుడు కూడా అక్టోబర్ నెల నుంచి డిసెంబర్ వరకు అనగా శీతాకాలంలోనే లభ్యమవుతుంది. గతంలో నాటు చెట్లు ద్వారా చిన్న పాటి పండ్లు మాత్రమే దొరికేవి. అప్పుడు ఒక పండు రూ.5 నుంచి రూ.10కే దొరికేవి. నేడు హైబ్రీడ్ పండ్లు కావడంతో నాలుగు పండ్లు ఒక కేజీకి వస్తున్నాయి. దీంతో ఒక కేజి రూ.120 నుంచి రూ.150 వరకు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. గూడూరు జాతీయ రహదారి వెంబడి పండ్ల వ్యాపారులు మినీ ట్రక్కుల్లో ఉంచి విక్రయిస్తున్నారు. అలాగే పట్టణ ప్రాంతంలో తోపుడు బండ్లు పైనా విక్రయిస్తుండగా, పండ్ల దుకాణాలలో కూడా విరివిగా దొరుకుతున్నాయి.

ఔషధ గుణాలు

- క్షయ వ్యాధి నివారణకు సీతాఫలాన్ని సమర్థమైన ఆహారంగా వినియోగిస్తారు.
- సీతా ఫలం దొరికిన సమయంలో వాటిలోని గుజ్జును తీసి భద్రపరుచుకుని వేసవి కాలంలో పాలల్లో కలిపి తాగితే శరీరంలోని వేడి, అతి దాహాన్ని తగ్గిస్తుంది.
- మెదడు నరాల వ్యవస్థను చురుకుగా పని చేయడానికి ఉపకరిస్తుంది.
- బలహీనంగా ఉన్న పిల్లలు, బాలింతలు సీతాఫలం గుజ్జును తేనెతో కలిపి సేవిస్తే అధిక శక్తి చేకూరుతుంది.
- సీతాఫలం ఆకులను ఎండబెట్టి పొడి చేసి కొబ్బరినూనెలో కలపి పుండ్ల మీద పూస్తే త్వరగా తగ్గి పోతాయి.
- తలలో ఉన్న చుండ్రు పోగొట్టేందుకు సీతాఫలం గింజలను ఎండ బెట్టి మెత్తగా పొడి చేసి రోజూ షాంపులా వాడితే చుండ్రు త్వరగా తగ్గి పోతుంది.

టీడీపీ దుర్మార్గాలను ఎదుర్కోవడమే లక్ష్యం

- సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- నాయుడుపేటలో కాకాణికి ఘన స్వాగతం



కాకాణి గోవర్ధన్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

నాయుడుపేట టౌన్: టీడీపీ కూటమి ప్రభుత్వ దుర్మార్గాలను ఎదుర్కోడమే వైఎస్ఆర్ సీపీ ప్రధాన లక్ష్యంగా చేసుకుని ముందుకు వెళుతున్నట్లు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. సంజీవయ్య ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు శనివారం సాయంత్రం నాయుడుపేట గోమతి సెంటర్ వద్ద మాజీ మంత్రి, పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపీక, ఎంపీపీ ధనలక్ష్మీ, నాయుడుపేట, సూళ్లూరుపేట, ఓజిలి తదితర మండలాలకు చెందిన నాయకులు కాకాణికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, స్వాగతించారు. సంజీవయ్య మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీరు లేకపోయినా మద్యం మాత్రం పూర్తిగా అందుబాటులో తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలపై పోరాటాలకు సన్నద్ధంగా ఉందన్నారు. కాకాణి నాయుడుపేట నుంచి సంజీవయ్య, ఇతర నాయకులతో చిల్లకూరు గ్రామానికి కార్లలో ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో వెంకటకృష్ణారెడ్డి, కలికి మాధవరెడ్డి, బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, గంధవల్లి సిద్ధయ్య, పాదర్తి హరినాథ్ రెడ్డి, దారా రవి, చదలవాడ కుమార్, పాలేటి నాగార్జున, కాళహస్తి భావన్, మీజూరు బాల, బాలు, రత్న శ్రీ, జెట్టి వేణు యాదవ్, మధుసూదన్‌రెడ్డి, సుబ్బారావు యాదవ్, షేక్ రహంతుల్లా, షేక్ షబ్బీర్, కింగ్స్‌వే జిలాని, వెంకటేశ్వర్లు, కావేరిపాకం అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు తావివ్వకూడదు



కడివేడు దళితవాడవాసులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ, చిల్లకూరు ఎస్ఐ

చిల్లకూరు: హత్య జరిగిన సందర్భంగా పలు కుటుంబాలు బాధలో ఉంటాయని అలాంటి కుటుంబాలకు గ్రామస్తులు అండగా ఉండాలే తప్ప విద్వేషాలు పెంచుకోకూడదని రూరల్ సీఐ కిషోర్ బాబు అన్నారు. చిల్లకూరు పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం కడివేడు గ్రామ దళితవాడకు చెందిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి రోజున గ్రామంలో అనుకోకుండా జరిగిన సంఘటనగా భావించి నష్టపోయిన కుటుంబానికి గ్రామస్తులు అండగా ఉండాలని అన్నారు. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగడం ద్వారా ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయని, దీనిని గ్రామస్తులంతా ఖండించాలని సూచించారు. అలాగే దళితవాడలో ఎవరైనా మద్యం విక్రయాలు చేస్తుంటే 100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఆయన వెంట చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు, కడివేడుకు చెందిన నాయకులు యదనపర్తి భాస్కర్‌రెడ్డి, ఎంఎల్‌టీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో శనివారం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండలపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం



కలశస్థాపన పూజ

ఓజిలి: మండలంలోని కర్రబల్లవోలు గ్రామంలో అవధూత శ్రీవెంకటాంబ అమ్మవారి 24వ ఆరాధన ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఉదయం అమ్మవారికి గణపతి పూజ, పూణ్యాహవచనం నిర్వహించి మండపారాధన చేశారు. పండితులు ప్రధాన కలశస్థాపన కార్యక్రమాన్ని వైభవంగా చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మహానైవేద్యం, మంగళహారతులు పట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఆరాధన ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు నెమళ్లపూడి గ్రామస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించి, అన్నదానం చేశారు. సాయంత్రం నెల్లూరు భక్తులతో భజన కార్యక్రమం, ముమ్మాయపాళెం శ్రీశీతలాంబ బృందంతో అమ్మవారి నామస్మరణ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చిల్లకూరు: తీర ప్రాంతంలోని ఈదులవారిపాళెం గ్రామంలో తూర్పుకనుపూరు గ్రామ సర్పంచ్ అన్నాడిశెట్టి నాగమ్మ ఆధ్వర్యంలో ఆమె భర్త గోపాలశెట్టి జ్ఞాపకార్థం శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నైలోని ప్రముఖ ఆసుపత్రులలో పని చేసే పలువురు వైద్యులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలోని వారికి ఉచితంగా కన్ను, పంటి, గర్భకోశ వ్యాధులు, చక్కెర వ్యాధి, బీపీ తదితర పరీక్షలు చేయించేందుకు చెన్నైలోని అపోలో ఆసుపత్రితోపాటుగా మరో రెండు ఆసుపత్రులలో పని చేసే ప్రముఖ వైద్యుల ద్వారా పరీక్షలు చేయించామని అన్నారు. కన్ను ఆపరేషన్ అవసరమైన వారికి చెన్నైలోనే ఉచితంగా చేయించేలా బస్సు ఏర్పాటు చేశామని, ఇందుకు గాను 12 మందికి ఆపరేషన్‌లు అవసరం ఉండగా 50 మంది వరకు కంటి అద్దాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు అన్నాడిశెట్టి మల్లికార్జున్ పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు



పెళ్లకూరు మండలం చిల్లకూరులో జోరుగా వరినాట్లు

– 4750హెక్టార్లు మేర వరి సాగు పనులు

పెళ్లకూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లోని రైతులు వరినాట్లు జోరుగా వేస్తున్నారు. ఇటీవల తెలుగుగంగ జలాలను చెరువులకు, స్వర్ణముఖి నదికి విడుదల చేయడంతో అన్నదాతలు సేద్యం పనులు ముమ్మరంగా చేస్తున్నారు. వ్యవసాయ పొలాల్లో ఎటు చూసినా నారుమడులు సిద్ధం చేయడం, పొలం గట్లు శుభ్రం చేసే కూలీలు, ట్రాక్టర్లతో దుక్కి దున్నడం, ఎడ్లమానుతో భూమిని చదును చేయడం, వరినాట్లు వేయడం తదితర పనులతో రైతులు, వ్యవసాయ కూలీలతో పొలాలు కళకళలాడుతున్నాయి. నడుం వంచి పార పనులు చేసే రైతులు, నెత్తిన వరినారు కట్టలు మోస్తూ చెమటోడ్చే వ్యవసాయ కూలీలు, చీర కొంగు నడుమున బిగించి జానపద గేయాలు పాడుకుంటూ వరినాట్లు వేసే మహిళలతో పల్లె ప్రాంతాల్లో వ్యవసాయం ఊపందుకుంది. మండలంలోని 24 పంచాయతీల్లో 67 మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద ఈ ఏడాది సుమారు 4750 హెక్టార్లు మేర వరినాట్లు వేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్ఎన్ఆర్, బీపీటీ తదితర వంగడాల వరినారు మళ్లు పూర్తి చేసుకొని వరినాట్లు జోరుగా వేస్తున్నారు.

భూసారంతో అధిక దిగుబడులు

ఆధునిక వ్యవసాయ విధానాల్లో భాగంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రియ ఎరువుల వాడకాలతో భూసారాన్ని పెంపొందించుకోవడానికి రైతులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఈ ఏడు సాగుకు ముందు ఎక్కువ మంది రైతులు భూసార పరీక్షలు చేసుకొని పంటల ఎంపిక, విత్తనాల సేకరణలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల రాయితీపై సరఫరా చేసిన జీలగ, జనుము, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట విత్తనాలు ఎకరానికి 12 నుండి 14 కేజీలను చల్లుకుని సాగు చేశారు. ఆధునిక వ్యవసాయ విధానంపై అవగాహన కలిగి సేద్యం చేసుకోవడంతో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు సాగు పనులు జోరుగా చేస్తున్నారు.

మొదలైన వరినాట్లు

మండలంలోని 24 పంచాయతీల్లో 4750 హెక్టార్లు మేర వరిసాగు చేస్తుండడంతో శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాల నుండి వచ్చిన వలస కూలీలతోపాటు స్థానికులతో వరినాట్లు జోరుగా వేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు ఆర్ఎన్ఆర్, బీపీటీ రకంతో పాటు ఈ ఏడాది కొత్తగా ఎంటీయూ 1224, ఎంటీయూ 1262, కేఎన్ఎం 16038 రకాల వరి వంగడాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వర్షాలకు ముందే పునబాక, చెంబేడు, పెళ్లకూరు, రావులపాడు, చిల్లకూరు, జీలపాటూరు తదితర చెరువులకు గంగ జలాలు విడుదల కావడంతోపాటు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.









వరినారు సిద్ధం చేస్తున్న కూలీలు, జీలపాటూరులో ట్రాక్టర్‌తో దుక్కి పనులు, నిండుకుండలా పెళ్లకూరు చెరువు, శిరసనంబేడు వ్యవసాయ కాలువ

రసాయనాల వాడకం తగ్గించాలి



డక్కిలిలో నిమ్మ తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి ఆనందరెడ్డి

డక్కిలి: రైతులు నిమ్మ సాగులో రసాయన పురుగు మందుల వాడకం తగ్గించాలని వెంకటగిరి ఉద్యానశాఖ అధికారి ఆనందరెడ్డి తెలిపారు. డక్కిలిలో ఆయన శనివారం పలువురు రైతులకు చెందిన నిమ్మ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విపరీతంగా పురుగు మందులు వాడుతుండడంతో నిమ్మ చెట్టు సహజ రోగ నిరోధక శక్తి మందగిస్తుందని తెలిపారు. వేరు కుళ్లు, ఎండు కొమ్మలు మెండుగా వస్తున్నాయన్నారు. దీని ప్రభావంతో పూత తగ్గుముఖం పట్టి దిగుబడి కూడా తగ్గిపోతుందన్నారు. రైతులంతా కూడా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఉద్యాన శాఖ అధికారులు సూచనలు, సలహాలతో మందులను క్రమ పద్ధతిలో వాడుకుని నాణ్యమైన పండ్లను ఉత్పత్తి చేయాల్సిందిగా సూచించారు. ప్రధానంగా గూడూరు డివిజన్ వ్యాప్తంగా నిమ్మలో పూత ఆలస్యం అవుతుందన్నారు. దీనికి ముఖ్య కారణం వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, పురుగు మందుల వినియోగంతో పూత రావడం లేదని తెలిపారు. నిమ్మలో వర్షాకాలం జూలై నుంచి ఆగస్టు నెల వరకు పూత పూయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అనుకూలించకపోవడంతో పూత రావడం కొద్దిగా ఆలస్యం అవుతోందని దీంతో నిమ్మ రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సైకోసిల్ ద్రావణాన్ని సమపాళ్లలో పిచికారీ చేసుకోవడంతో పూత ఎదుగుదల బాగా వస్తుందని సూచించారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి



జ్యోతి వెలిగిస్తున్న గూడూరు డీఎస్పీ రమణకుమార్

గూడూరు రూరల్: ప్రతి ఒక్కరు క్రీడలను తమ జీవితంలో భాగం అయ్యేలా చూసుకుంటే జీవిత కాలం శారీరక దృఢత్వం ఏర్పడుతుందని గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ సూచించారు. పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి క్రీడలను ఆరంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శరీరం చురుకుగా ఉండి ఆరోగ్యవంతంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు కూడా పోటీతత్వంతో ఉండాలని, ప్రతి ఒక్కరు విజేతలుగా నిలవలేరని అన్నారు. అలా అని పోటీలలో పాల్గొనకుండా ఉండి పోకూడదని తెలిపారు. పలు పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జాతీయ హాకీ క్రీడాకారుడు కె.భానుప్రకాష్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ వి.రవిప్రసాద్, డీన్ డాక్టర్ విష్వక్సేన్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఏఓ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పథకాన్ని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఏపీఎం చంద్రశేఖర్

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్దలకు చదువు నేర్పడం కోసం ఉల్లాస్ అనే పథకాన్ని ప్రవేశ పెట్టిందని, ఆ పథకాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఏపీఎం చంద్రశేఖర్ కోరారు. మండల కేంద్రమైన సైదాపురంలో శనివారం వీఏఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువులేని వారిని గుర్తించి వారికి సులభంగా చదవడం, రాయడం నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఓలు వలంటీర్ టీచర్లుగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి వీఏఓ కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు చైర్మన్‌గా ఎంపీడీఓ, సభ్యులుగా ఏపీఎం, సీడీపీఓ, ఎంఈఓ ఉంటారన్నారు. ఏపీఎం శైలజమ్మ తదితరులున్నారు.



రాపూరులో ఉల్లాస్‌పై అవగాహన కార్యక్రమం

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

రాపూరు: మండలంలో నిరక్షరాస్యులైన స్వయం సహాయ సంఘ సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వయోజన విద్య విద్యాశాఖ అధికారి మహ్మద్ అజాద్ పేర్కొన్నారు. రాపూరు వెలుగు కార్యాలయంలో శనివారం ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్లు, టీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు ఆ సంఘ సభ్యుల్లోని చదువుకున్న వారు వలంటీర్లుగా పని చేసి నాలుగు మాసాల్లో అక్షరాస్యులుగా చేయాలని సూచించారు. 15 సంవత్సరాలు పైబడిన వారికి బ్యాంకు లావాదేవీలు జరిపే విధంగా వారిని అక్షరాస్యులుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భవాని, ఏపీఎం రాధ, వలంటీర్లు, సీసీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



జిగురు అట్టలను రైతులకు పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్: రైతులు పంటల సాగులో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో శనివారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అనుసరించి సాగులో సన్నద్ధం కావాలని సూచించారు. నేలలో కర్బన శాతం పెంచాలని అదేవిధంగా అలాగే జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు వాడడంతో పురుగుల ఉధృతి తగ్గుముఖం పట్టడంతోపాటు పంట నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలియజేశారు. ఈ మేరకు రైతులు వ్యవసాయంలో రాణించాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ అధినేత షణ్ముఖం మాట్లాడుతూ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటలో రాణించాలని సూచించారు. అనంతరం రైతులకు నీలి, పసురు రంగు జిగురు అట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఆనంద్, కేవీకే శాస్త్రవేత్తలు తిరుపాలు, విజయశ్రీ, నాగార్జున రెడ్డి, రాజీవన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటగిరి రాజా జన్మదిన వేడుకలు



అన్నదానం ప్రారంభిస్తున్న రాజా కుటుంబీకులు డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర



కేక్ కట్ చేస్తున్న అభిమానులు, వైఎస్ఆర్ సీపీ నేతలు

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి రాజ కుటుంబీకులు వెలుగోటి సర్వజ్ఞ కుమార యాచేంద్ర జన్మదిన వేడుకలను శనివారం వైఎస్ఆర్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ ఆధ్వర్యంలో వెంకటగిరి గ్రామశక్తి శ్రీపోలేరమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజా ప్యాలెస్ వద్ద బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేపట్టారు. రాజా కుటుంబీకులు డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని, పేదలకు అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ తమ సంస్థానానికి వారసుడైన సర్వజ్ఞ కుమార యాచేంద్ర రాజాల ప్రతిష్ఠతను ఇనుమడింప చేయాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ చేతరాశి బాలయ్య, కౌన్సిలర్లు ఎంఏ నారాయణ, ఆరి శంకరయ్య రాజా అభిమానులు ఆవులు వెంకటేశ్వర్లు, కావేరిపాకం రమేష్, పవన్, జలగం కామాక్షి, మంగలపూరి వెంకటేశ్వర్లు, పూజారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.